# విద్యార్థుల సేవా దృక్పథం అభినందనీయం

హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ



కూకట్‌పల్లి పీఎస్‌ఎం పాఠశాలలో విద్యార్థులు సేకరించిన బియ్యాన్ని అనాథాశ్రమ నిర్వాహకులకు అందిస్తున్న హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ, హన్మంతరావు తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 24 : విద్యార్థులు సేవా దృక్పథంతో గుప్పెడు బియ్యాన్ని దానం చేయడం అభినందనీయమని హర్యానా గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. ఆదివారం కూకట్‌పల్లి స్వామివివేకానంద సేవా సమితి ఆధ్వర్యంలో పీఎస్‌ఎం పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో హర్యాన గవర్నర్ బండారు దత్తాత్రేయ పాల్గొన్నారు. పాఠశాల విద్యార్థులు సేకరించిన 60 క్వింటాళ్ల బియ్యాన్ని శివానంద ఆశ్రమం, అమ్మానాన్న ఆశ్రమం, వైదేహీసేవా ఆశ్రమం, లాసర్ల సింధూ సేవ ఆశ్రమం, సాయిసేవా సదన్‌కు విరాళంగా అందజేశారు. ఈ సందర్భంగా బండారు దత్తాత్రేయ మాట్లాడుతూ.. పాఠశాల దశలోనే విద్యార్థుల్లో సేవా దృక్పథాన్ని పెంపొందించడం సంతోషకరమన్నారు. విద్యార్థులు, తోటి విద్యార్థుల వద్ద గుప్పెడు బియ్యాన్ని తీసుకుని 60 క్వింటాళ్ల బియ్యాన్ని సిద్ధం చేయడం గొప్ప విషయమన్నారు. ఇలాంటి సేవా కార్యక్రమాలలో విద్యర్థులు భాగస్తులు కావాలన్నారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్మన్ హన్మంతరావు, మేడ్చల్ జిల్లా అధ్యక్షుడు పన్నాల హరీశ్‌రెడ్డి, నియోజకవర్గం ఇన్‌చార్జి మాధవరం కాంతారావు, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డెపల్లి రాజేశ్వర్‌రావు, సూర్యప్రకాశ్‌రావు, సూర్యారావు పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు



మంత్రి సీతక్కకు శుభాకాంక్షలు తెలుపుతున్న ఆల్ ఇండియా యువజన సంఘం గ్రేటర్ హైదాబాద్ అధ్యక్షుడు కర్క నాగరాజు తదితరులు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 24 : తెలంగాణ రాష్ట్ర పంచాయతిరాజ్, రూరల్ డెవలప్‌మెంట్ ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ అసోసియేషన్ శాఖ మంత్రిగా ప్రమాణస్వీకారం చేసిన మంత్రి అనసూయ (సీతక్క)కు గ్రేటర్ హైదరాబాద్ ఆల్ ఇండియా అంబేద్కర్ యువజన సంఘం అధ్యక్షుడు కర్క నాగరాజు పుష్పగుచ్ఛాన్ని అందించి.. శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం నేతలు జక్కుల అశోక్, శ్రీనివాస్, సాదా మహేశ్, ఫయాజ్, గుండె శివరాజు తదితరులున్నారు.

## కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ



క్యాంపు ఆఫీస్‌లో లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కేపీహెచ్‌బీ కాలనీ, డిసెంబర్ 24 : కూకట్‌పల్లి ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 63 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులను ఎమ్మెల్యే కృష్ణారావు పంపిణీ చేశారు. ఆబిడ్డ పెండ్లికి ప్రభుత్వం సాయమందిస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నేతలు శ్రీహరి తదితరులున్నారు.

## సెమీ క్రిస్మస్ వేడుకలు



సెమీక్రిస్మస్ వేడుకల్లో కేక్ కట్ చేస్తున్న కార్పొరేటర్ సబీహాబేగం

అల్లాపూర్, డిసెంబర్24: క్రిస్మస్ వేడుకలను ఘనంగా జరుపుకోవాలని అల్లాపూర్ కార్పొరేటర్ సబీహాబేగం అన్నారు. డివిజన్ పరిధిలోని పర్వత్‌నగర్‌లో మునెమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ఏర్పాటు చేసిన సెమీక్రిస్మస్ వేడుకలకు ముఖ్య అతిథిగా కార్పొరేటర్ సబీహాబేగం హాజరయ్యారు. క్రిస్మస్ కేక్ కట్ చేసి క్రిస్టియన్ సోదరులకు శుభాకాంక్షలు తెలిపారు.

### వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో..



క్రిస్మస్ వేడుకల్లో పాల్గొన్న విద్యార్థులతో పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయరాణి

దుండిగల్,డిసెంబర్24: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి, బాచుపల్లిలోని వీఆర్ఎస్ విజ్ఞానజ్యోతి పాఠశాలలో ఆదివారం క్రిస్మస్ వేడుకలు కున్నుల పండువగా జరిగాయి. ముఖ్య అతిథిగా హాజరైన పాఠశాల డైరెక్టర్ కొడాలి విజయారాణి మాట్లాడారు. అనంతరం విద్యార్థులకు ఆమె క్రిస్మస్ కానుకలను అందజేశారు. ఉపాధ్యాయులు, అధ్యాపకేతర సిబ్బంది వేడుకల్లో పాల్గొన్నారు.

## దళితుల ఆర్థిక అభ్యున్నతికి 'డిక్కా' కృషి

బన్సీలాల్‌పేట్, డిసెంబర్ 24 : నిరుపేద మాదిగ, ఉపకులాల ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకుని, ఆర్థికంగా ఎదిగేందుకు సహరించడానికి 'డిక్కా' సంస్థ కృషి చేయడం అభినందనీయమని ఉస్మానియా లా కళాశాల మాజీ డీన్ ప్రొఫెసర్ గాలి వినోద్‌కుమార్ అన్నారు. బన్సీలాల్‌పేట్ బీజేఆర్‌నగర్‌లో సంస్థ ప్రధాన కార్యాలయాన్ని ఆయన మాజీ ఎమ్మెల్సీ డి.రాజేశ్వర్ రావుతో కలిసి ప్రారంభించారు. సంస్థ చైర్మన్ రాగటి సత్యం మాదిగ, వ్యవస్థాపక జాతీయ అధ్యక్షుడు రాగటి భవానికుమార్ మాట్లాడుతూ.. అణగారిన కులాల పారిశ్రామిక, నిశ్చయ కార్యాచరణ వాణిజ్య మండలి(డిక్కా)పేరుతో రిజిస్టర్డ్ చేయబడిన తమ సంస్థ ద్వారా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీల అభ్యున్నతికి విజయవంతంగా అమలు చేస్తున్న సంక్షేమ పథకాల గురించి జాతీయ, రాష్ట్ర, మండల, గ్రామస్థాయిల్లో ప్రజా చైతన్య కార్యక్రమాలు, అవగాహన శిబిరాలను ఏర్పాటు చేస్తామని అన్నారు. ఆర్థికాభివృద్ధికి అంకిత భావంతో పనిచేయడానికే తమ 'డిక్కా' సంస్థ పనిచేస్తుందని, పేద మాదిగలు నేరుగా బన్సీలాల్‌పేట్ బీజేఆర్ నగర్‌లోని తమ సంస్థ కార్యాలయానికి నేరుగా రావొచ్చని వారి కోరారు. పారిశ్రామికవేత్తలు పుట్టపాక శ్రీనివాస్, చింతా సాంబమూర్తి, డాక్టర్ ఎం.శివకుమార్ లాల్ పాల్గొన్నారు.

## మహాపడిపూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్



మహాపడి పూజలో పాల్గొన్న ఎమ్మెల్యే వివేకానంద్, మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి తదితరులు

దుండిగల్,డిసెంబర్24: కుత్బుల్లాపూర్ నియోజకవర్గం,నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి,11వ డివిజన్ కేటీఆర్ కాలనీలో స్థానిక కార్పొరేటర్ వాకలపూడీ రవికిరణ్, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు వాకలపూడీ రంగరాయ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'శ్రీ అయ్యప్ప స్వామి మహాపడిపూజ' మహోత్సవంలో ఎమ్మెల్యే కేపి.వివేకానంద్, నిజాంపేట్ మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డిలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేకపూజలు నిర్వహించిన అనంతరం జరిగిన పల్లకీసేవలో వారు పాల్గొన్నారు. వేడుకల్లో డిప్యూటీ మేయర్ ధన్‌రాజుయాదవ్‌తో పాటు పలువురు కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నేతలు పాల్గొన్నారు.

### గ్యార్వీ ఉత్సవాల్లో పాల్గొన్న ఎమ్మెల్యే..

గాజులరామారం సర్కిల్, సూరారం డివిజన్ పరిధిలోని నెహ్రూనగర్‌లోని గౌస్,-ఈ పక్ దర్గా వద్ద ఆదివారం నిర్వహించిన గ్యార్వీ ఉత్సవాల్లో ఎమ్మెల్యే వివేకానంద్ పాల్గొని ప్రత్యేక ప్రార్థనలు చేశారు. కార్యక్రమంలో గాజులరామారం డివిజన్ కార్పొరేటర్ రావుల శేషగిరి, డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

## గ్యార్వీ షరీఫ్ వేడుకలు



ఆల్విన్‌కాలనీ డివిజన్ తారకరామానగర్‌లో బీఆర్ఎస్ నాయకుడు సమద్ ఆధ్వర్యంలో ఆదివారం గ్యార్వీ షరీఫ్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్ వేడుకలలో పాల్గొన్నారు. ప్రజలంతా కుల మతాలకు అతీతంగా సోదర భావంతో ముందుకు సాగాలని ఆయన పిలుపునిచ్చారు. అనంతరం ఆయన అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

– మియాపూర్, డిసెంబర్ 24

## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



యువజన సంఘం ప్రతినిధులతో సమావేశమై సమస్య తెలుసుకుంటున్న కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ

దుండిగల్,డిసెంబర్24: ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటూ ప్రజాసమస్యలను పరిష్కరించడమే ధ్యేయంగా పనిచేస్తున్నామని దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ అన్నారు. ఆదివారం శంభీపూర్‌లోని ఆయన కార్యాలయం వద్ద నియోజకవర్గం పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, యువజన సంఘాలు, కాలనీ సంక్షేమసంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ బస్తీలు, కాలనీలల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు.

### అయ్యప్పస్వామి పడిపూజలో పాల్గొన్న కృష్ణ..

కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, కొంపల్లి మున్సిపాలిటీ పరిధి, దూలపల్లిలో బూర్గుబావి మోహన్‌రావు ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించిన అయ్యప్పస్వామి పడిపూజా మహోత్సవంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గం బీఆర్ఎస్ నాయకులు, దుండిగల్ మున్సిపల్ కౌన్సిలర్ శంభీపూర్‌కృష్ణ పాల్గొన్నారు.

## మైత్రివన్‌కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి



మైత్రివన్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులతో సమావేశమైన కార్పొరేటర్ నర్సింహయాదవ్

బాలానగర్, డిసెంబర్ 24 : మైత్రివన్‌కాలనీ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఓల్డ్‌బోయిన్‌పల్లి కార్పొరేటర్ ముద్దం నర్సింహయాదవ్ అన్నారు. ఆదివారం డివిజన్ పరిధిలోని మైత్రివన్‌కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ కమిటీ సభ్యులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మైత్రివన్‌కాలనీ సమస్యలు ఏవైనా ఉంటే వాటి పరిష్కారానికి కృషి చేస్తానన్నారు. కాలనీవాసులు ఏవైనా సమస్యలు తలెత్తుతే తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. డివిజన్ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యలు పరిష్కరిస్తానన్నారు. ప్రజలకు కావాల్సిన మౌలిక సదుపాయాలు కల్పించడంలో కీలకంగా వ్యవహరిస్తానని తెలిపారు. కార్యక్రమంలో జగన్‌రెడ్డి, రామకృష్ణ, హనుమంతరావు, గోపాల్‌రెడ్డి, ఎల్ఎన్ ప్రసాద్ కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

## అర్హులందరికి సంక్షేమ పథకాలు



ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లో పర్యటిస్తున్న కాంగ్రెస్ నాయకుడు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు

దుండిగల్,డిసెంబర్24: అర్హులైన ప్రతిఒక్కరికి ప్రభుత్వ సంక్షేమపథకాలు అందేలా చూస్తామని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి(కేఎస్ఆర్) అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని ఇందిరమ్మ కాలనీ ఫేజ్-2లో ఆదివారం ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా స్థానికులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగితెలుసుకున్నారు.అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. ఇందిరమ్మ రాజ్యంలో పేదలందరికి న్యాయం జరుగుతుందన్నారు.ప్రభుత్వం త్వరలోనే అమలు చేయనున్న మహాలక్ష్మి పథకంతోపాటు తెలుపురంగు రేషన్‌కార్డుల జారీ, రూ.500లకే వంటగ్యాస్ సిలిండర్ వంటి సంక్షేమపథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా చూస్తానన్నారు. కార్యక్రమంలో ఇందిరమ్మ కాలనీ, బాలాజీహిల్స్ కాలనీతో పాటు బాలాజీనగర్ వాసులు, మహిళలు, స్థానికులు పాల్గొన్నారు.